అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people

శుక్రవారం 17, జూలై 2026 సంపుటి : 03 సంచిక : 149

# మంగళకరం.. మనోహరం

- గోల్కొండ కోటలో వైభవంగా ప్రారంభమైన ఆషాఢ బోనాలు
- జగదాంబిక అమ్మవారికి 'తొలి బోనం'..
- భక్తిశ్రద్ధలతో పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు సురేఖ, పొన్నం

3

అక్షరదర్బార్, హైదరాబాద్

తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల జాతర మహోత్సవాలు గోల్కొండ కోటలో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం గోల్కొండ జగదాంబిక అమ్మవారికి సమర్పించిన 'తొలి బోనం'తో ఈ ఉత్సవాలు ఘనంగా ఆధ్యాత్మిక వాతావరణంలో మొదలయ్యాయి. బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని లంగర్ హౌజ్ చౌరస్తాలో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ జిల్లా ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఉత్సవ వేదిక వద్దకు చేరుకున్న మంత్రులకు ఆలయ అర్చకులు మంత్రోచ్ఛారణలు, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు మంత్రులు కలిసి జగదాంబిక అమ్మవారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# అమాయక జనమే టార్గెట్



- రూ.200 టికెట్ తో బ్రీజా కారు ఆశ
- లాటరీ పేరిట రూ.11.50 లక్షల దోపిడీ
- 'వెంకటేశ్వర కార్ గిఫ్ట్ కాంటెస్ట్' గుట్టురట్టు చేసిన టాస్క్‌ఫోర్స్
- ముగ్గురు నిర్వాహకులు అరెస్ట్, లక్షల నగదు, కారు స్వాధీనం

3



# తాగునీటికి ప్రాధాన్యత

- ఆగస్టు 15లోగా యూనిఫాంల పంపిణీ
- ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తత.. ప్రతి శుక్రవారం 'డ్రై డే'
- యుద్ధప్రాతిపదికన 'అమృత్' పనులు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర సీఎస్ సంజయ్ జాజు ఆదేశాలు

అక్షరదర్బార్, హనుమకొండ

రాష్ట్ర ప్రభుత్వానికి తాగునీటి సరఫరా అత్యంత ప్రాధాన్యత అంశమని, ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా అన్ని ప్రాజెక్టుల్లో అవసరమైన నీటి మట్టాలను తప్పనిసరిగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో తాగునీటి సరఫరా, 'అమృత్' పనుల పురోగతి, సీజనల్ వ్యాధుల నియంత్రణ, విద్యాశాఖ పురోగతి, సూపర్ ఎల్‌నినో పరిస్థితులపై సుదీర్ఘ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హన్మకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

4

# చెరువులను నింపండి

- సాగు, తాగునీటికి తక్షణమే దేవాదుల జలాలు వదలాలి
- కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్లే 'గణప సముద్రం' కెనాల్ పనులు బంద్
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- రామప్ప, గణపురం చెరువుల సందర్శన.. క్షేత్రస్థాయిలో పరిశీలన

4



# ఏసీబీ వలలో ఈఈ, ఏఈ

- రూ.60 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ అధికారులు
- పౌల్ట్రీ ఫామ్ 'ఎన్‌ఓసీ' కోసం లంచం డిమాండ్

4





## మోకుదెబ్బ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్‌గా కందుల శ్రీనివాస్ గౌడ్

అక్షరదర్బార్, నర్సంపేట : గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్‌గా కందుల శ్రీనివాస్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ గురువారం నియామక పత్రాన్ని విడుదల చేశారు. ఇటీవల హుస్నాబాద్‌లో జరిగిన సంస్థ విస్తృత స్థాయి సమావేశంలో జాతీయ సెక్రటరీ జనరల్ రాగుల సిద్ధిరాములు గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్‌ల సమక్షంలో ఈ నియామకం చేపట్టారు. ఈ సందర్భంగా నర్సాగౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తుల హక్కుల సాధన కోసం, సంస్థ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో శ్రీనివాస్ గౌడ్ చొరవ చూపాలని సూచించారు. తన నియామకానికి సహకరించిన ముత్యం నరసింహులు గౌడ్, మద్దెల సాంబయ్య గౌడ్, గోపగాని వెంకటేశ్వర్లు గౌడ్‌లకు శ్రీనివాస్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

## చిరు వ్యాపారుల దుకాణాలు కూల్చడం దారుణం

**వార్డు కౌన్సిలర్ పూర్ణచారి**



అక్షరదర్బార్, పరకాల : అసలే వ్యాపారాలు లేక ఇబ్బందులు పడుతున్న పరకాల పట్టణ ప్రజలపై మున్సిపల్ అధికారులు, అధికార పార్టీ నాయకులు కూల్చివేతలతో అదనపు భారం మోపుతున్నారని 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారి ఆరోపించారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా మెయిన్ రోడ్డుపై ఉన్న దుకాణ సముదాయాలను ఆక్రమణల పేరుతో కూల్చడం బాధాకరమన్నారు. పట్టణంలోని పారిశుధ్యం, బకాయిల వసూళ్లు వంటి సమస్యలను పక్కనబెట్టి, చిన్న వ్యాపారుల పొట్టకొట్టడం సరికాదన్నారు. అధికారులు ఇప్పటికైనా కూల్చివేతలు నిలిపివేసి, నష్టపోయిన వ్యాపారులను ఆదుకోవాలని, భవిష్యత్తులో నోటీసులు ఇచ్చి చట్టబద్ధంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.



# మేడారం అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

- భక్తులకు ఆహ్లాదకర వాతావరణం, మెరుగైన సౌకర్యాలు కల్పించాలి
- ట్రాఫిక్ సమస్యలు లేకుండా రహదారుల విస్తరణకు కార్యాచరణ సిద్ధం చేయాలి
- పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలి
- మంత్రి సీతక్క



అక్షర దర్బార్, ములుగు: మేడారం మహా జాతరకు విచ్చేసే కోట్లాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. గురువారం తాడ్వాయి మండలం మేడారం మంత్రి సీతక్క ,జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి సమ్మక్క–సారలమ్మ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, మేడారంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తదుపరి మేడారం ఇంగ్లీష్ మీడియం ఆశ్రమ పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి, మేడారం హరిత హోటల్‌లో మేడారం అభివృద్ధి పనులపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ మేడారం మహా జాతరకు వచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా మేడారం–తాడ్వాయి, పస్రా–మేడారం, చిన్నబోయినపల్లి–కొండాయి–ఊరట్టం రహదారుల విస్తరణకు యుద్ధ ప్రాతిపదికన అంచనాలు సిద్ధం చేసి, అవసరమైన అనుమతులను త్వరితగతిన పొందేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వనదేవతల దర్శనానికి వచ్చే భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్యూ లైన్లను ఆధునికీకరించడంతో పాటు ఆలయ పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు, సిహెచ్ మహేందర్ జి,సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి,ఆర్ డి ఓ కృష్ణవేణి, జిల్లా అధికారులు,ఆలయ పూజారులు,గుత్తేదారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పూజారులు, సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పరకాలలో భక్తిశ్రద్ధలతో హజ్రత్ సాధిక్ షా వలీ దర్గా ఉత్సవాలు

అక్షరదర్బార్, పరకాల : పరకాల పట్టణ బస్టాండ్ ఎదురుగా ఉన్న హజ్రత్ సాధిక్ షా వలీ దర్గా ఉత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. గత 14 ఏళ్లుగా మొహరం నెల 29వ రోజున ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాల్లో భాగంగా మేనేజింగ్, పెద్దల కమిటీల ఆధ్వర్యంలో దర్గాలో పవిత్ర గిలాఫ్ (దుప్పట్లు), పూలను సమర్పించి ఖత్మూల్ ఖురాన్, సలాం, దువా, ఫాతిహా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో సయ్యద్ గౌస్, ఎండీ నయీముద్దీన్, సయ్యద్ అక్రమ్ మరియు ముస్లిం పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.





## చిట్యాల కేజీబీవీలో విద్యార్థినులకు ఉచిత దుస్తుల పంపిణీ చేసిన ట్రైనీ కలెక్టర్

అక్షరదర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో గురువారం విద్యార్థినులకు ఉచిత దుస్తుల పంపిణీ కార్యక్రమం సర్పంచ్ తౌటం లక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ట్రైనీ కలెక్టర్ నవీన్ రెడ్డి విద్యార్థినులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా వసతులను, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వసంత రావు, ఎంఈఓ రఘుపతి, ప్రిన్సిపాల్ సుమలత, ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.



## చిరు వ్యాపారుల జీవనోపాధికి భంగం కలిగించొద్దు

**బీజేపీ కౌన్సిలర్ విజయ్‌కుమార్**

**అక్షరదర్బార్, పరకాల :** పరకాల పట్టణంలో రోడ్ల పక్కన ఉన్న చిరు వ్యాపారాలను తొలగించే చర్యలను మున్సిపల్ అధికారులు వెంటనే నిలిపివేయాలని బీజేపీ 15వ వార్డు కౌన్సిలర్ కుక్కల విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల ఒత్తిడితోనే అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పలుకుబడి ఉన్నవారి ఆక్రమణలను వదిలేసి, కిరాణా, హోటళ్లు, పండ్లు అమ్ముకునే పేదలపై చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. అధికారులు మానవతా దృక్పథంతో ఆలోచించి, చిరు వ్యాపారులను తొలగించకుండా వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూపాలని కోరారు.

## పంచాయతీలకు నిధులివ్వకుండా విద్యుత్ బిల్లుల కోసం ఒత్తిడి చేయడం తగదు



అక్షరదర్బార్, దుగ్గొండి : ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లులను వెంటనే చెల్లించాలంటూ మండల పంచాయతీ అధికారులు (ఎంపీఓ) సర్పంచులు, కార్యదర్శులపై ఒత్తిడి తీసుకురావడం తగదని దుగ్గొండి మండల సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము పదవులు చేపట్టి ఆరు నెలలు కావస్తున్నా ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని, స్థానికంగా వసూలైన పన్నుల డబ్బులను కూడా అకౌంట్లలో సీజ్ చేయడం దారుణమన్నారు. నిధులు లేక గ్రామాలల్లో పనులు చేయలేని పరిస్థితి ఉంటే, పాత కరెంట్ బిల్లుల కోసం హుకుం జారీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## పేకాట ఆడితే కఠిన చర్యలు

**ఎస్సై పరమేశ్వర్ హెచ్చరిక**

**గట్లకానిపర్తి శివారులో పోలీసుల దాడి..**

**ఆరుగురి అరెస్ట్**

అక్షరదర్బార్, శాయంపేట : శాయంపేట మండలం గట్లకానిపర్తి గ్రామ పరిధిలో పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారంతో దాడులు నిర్వహించి బొమ్మకంటి దిలీప్, ఆకనూర్ ప్రసాద్, బొమ్మకంటి సుధీర్, చుండు సంపత్, బొమ్మకంటి దినేష్, బొమ్మకంటి శ్రీకాంత్‌లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పరమేశ్వర్ తెలిపారు. వీరి వద్ద నుండి రూ. 1,100 నగదు, స్కోర్ కార్డు, పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించే పేకాట లాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు

## రాష్ట్రస్థాయి క్రీడల్లో నాలుగు పతకాలు సాధించిన హెడ్ కానిస్టేబుల్ సుజాత



అక్షరదర్బార్, పరకాల : తెలంగాణ 5వ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో నాలుగు పతకాలు సాధించి ప్రతిభ చాటిన పరకాల పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ నాగెల్లి సుజాతను సీఐ వి. క్రాంతికుమార్ ఘనంగా అభినందించారు. హైదరాబాద్ మల్కాజిగిరిలో జరిగిన ఈ పోటీల్లో సుజాత పవర్‌లిఫ్టింగ్‌లో స్వర్ణం, వెయిట్‌లిఫ్టింగ్‌లో రజతం, బాక్సింగ్‌లో కాంస్యం, వుషూ విభాగంలో మరో రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. పరకాల పోలీస్ స్టేషన్‌లో ఆమెను శాలువాతో సత్కరించిన సీఐ క్రాంతికుమార్, సుజాత సాధించిన విజయాలు పోలీస్ శాఖకే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రమేష్, హెడ్ కానిస్టేబుల్ టి. సర్వన్, కానిస్టేబుల్ రాజయ్య పాల్గొన్నారు.

# మంగళకరం.. మనోహరం

- గోల్కొండ కోటలో వైభవంగా ప్రారంభమైన ఆషాఢ బోనాలు
- జగదాంబిక అమ్మవారికి 'తొలి బోనం'..
- భక్తిశ్రద్ధలతో పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు సురేఖ, పొన్నం

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల జాతర మహోత్సవాలు గోల్కొండ కోటలో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం గోల్కొండ జగదాంబిక అమ్మవారికి సమర్పించిన 'తొలి బోనం'తో ఈ ఉత్సవాలు ఘనంగా ఆధ్యాత్మిక వాతావరణంలో మొదలయ్యాయి. బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని లంగర్ హౌజ్ చౌరస్తాలో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ జిల్లా ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఉత్సవ వేదిక వద్దకు చేరుకున్న మంత్రులకు ఆలయ అర్చకులు మంత్రోచ్చారణలు, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు మంత్రులు కలిసి జగదాంబిక అమ్మవారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### ఆధ్యాత్మిక హోరు.. సాంస్కృతిక జోరు

డప్పు చప్పుళ్ళు, పోతురాజుల వీర విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, సాంస్కృతిక కళాకారుల ప్రదర్శనల నడుమ కోట పరిసర ప్రాంతాలన్నీ భక్తి సాగరంలో మునిగితేలాయి. ఈ సందర్భంగా కళాకారుల కోరిక మేరకు మంత్రి కొండా సురేఖ 'ఈరగోల'ను చేతిలోకి ధరించి వారిని ఉత్సాహపరిచారు. సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'ఆషాఢ బోనాల ఉత్సవాల బుక్‌లెట్'ను మంత్రులు ఆవిష్కరించారు. అలాగే ప్రభుత్వం తరఫున జగదాంబిక ఆలయ కమిటీకి రూ.11 లక్షల ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు.

– ప్రజా సంక్షేమమే ధ్యేయం.. సమృద్ధిగా వర్షాలు కురవాలి

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. "గోల్కొండ జగదాంబిక అమ్మవారి దయతో ఎల్ నినో ప్రభావం తగ్గి, భూతల్లి శాంతించి, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ప్రధాన ఎజెండాగా పనిచేస్తోంది" అని అన్నారు. పెద్ద దేవాలయాలతో పాటు చిన్న దేవాలయాలకు కూడా ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకల ఏర్పాట్లు చేసినట్లు ఆమె స్పష్టం చేశారు. ఈ మహోత్సవంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరెక్టర్ హనుమంతరావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




# కన్నవారిని పట్టించుకోకపోతే చర్యలు

### 2007 చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తాం

### ఆర్డీవో కృష్ణవేణి

అక్షరదర్బార్, ములుగు: వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007 ప్రకారం కన్నవారిని కొడుకులు పట్టించుకోని పక్షంలో చర్యలు తప్పవని తల్లిదండ్రులు, సీనియర్ పౌరుల పోషణ సంక్షేమ ట్రిబ్యునల్ అధికారి, ఆర్డీవో కే కృష్ణవేణి తెలిపారు. ములుగు మండలం దేవగిరిపట్నం గ్రామానికి చెందిన గాదె నక్షత్రారెడ్డి, జేసింతమ్మలు తమ కుమారులు గాదె అశోక్ రెడ్డి, గాదె అబ్రహంరెడ్డిలు తాము సంపాదించిన ఆరు గుంటల స్థలాన్ని ఇరువురికి సమానంగా పంపిణీ చేసిన అనంతరం తమను పట్టించుకోవడం లేదంటూ ఫిర్యాదు చేశారని అన్నారు. ఈ క్రమంలో నక్షత్ర రెడ్డి కుమారులకు 2007 చట్టం సెక్షన్ 5 (1) ప్రకారం నోటీసులు జారీ చేయగా గత నెల 30వ తేదీన విచారణ చేయగా తల్లిదండ్రులను పట్టించుకోవడంలేదని విషయాన్ని పరిగణలోకి తీసుకోవడం జరిగిందని అన్నారు. దీంతో 2007 చట్టం సెక్షన్ 9 (1) సెక్షన్ 4 ప్రకారం తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తి విషయంలో కొడుకులు జోక్యం చేసుకోరాదని, తమ ఉత్తర్వులను పాటించని పక్షంలో చట్ట ప్రకారం కేసు నమోదు చేయబడతాయని కృష్ణవేణి తెలిపారు..



# తాగునీటికి ప్రాధాన్యత

- ఆగస్టు 15లోగా యూనిఫాంల పంపిణీ
- ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తత.. ప్రతి శుక్రవారం 'డ్రై డే'
- యుద్ధప్రాతిపదికన 'అమృత్' పనులు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర సీఎస్ సంజయ్ జాజు ఆదేశాలు



అక్షరదర్బార్, హనుమకొండ: రాష్ట్ర ప్రభుత్వానికి తాగునీటి సరఫరా అత్యంత ప్రాధాన్యత అంశమని, ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా అన్ని ప్రాజెక్టుల్లో అవసరమైన నీటి మట్టాలను తప్పనిసరిగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో తాగునీటి సరఫరా, 'అమృత్' పనుల పురోగతి, సీజనల్ వ్యాధుల నియంత్రణ, విద్యాశాఖ పురోగతి, సూపర్ ఎల్‌నినో పరిస్థితులపై సుదీర్ఘ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హన్మకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

– యుద్ధప్రాతిపదికన తాగునీటి పనులు

ఈ సందర్భంగా సీఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ, అమృత్ పథకం కింద చేపట్టిన అన్ని తాగునీటి పనులను గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నీటి వనరుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తూ.. 'వీబీజీఆర్ఏఎంజీ' కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటి సంరక్షణ పనులు, ఇంకుడు గుంతల నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు.

### ప్రతి శుక్రవారం 'డ్రై డే'

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నివారణ కోసం ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. "ప్రతి శుక్రవారం తప్పనిసరిగా 'డ్రై డే' కార్యక్రమాన్ని నిర్వహించాలి. దోమల నివారణ చర్యలు చేపట్టడంతో పాటు గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుధ్య పనులను ముమ్మరం చేయాలి" అని సీఎస్ ఆదేశించారు.

### ఆగస్టు 15 లోగా యూనిఫాంల పంపిణీ..

విద్యాశాఖ సమీక్షలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే ఒక జత యూనిఫాంలను ఆగస్టు 15వ తేదీ లోపు ఖచ్చితంగా పంపిణీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే, సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని, వారికి అవసరమైన విత్తనాలను ఎక్కడికక్కడ సిద్ధంగా ఉంచాలని వ్యవసాయ అధికారులకు సూచించారు.

### హాజరైన అధికారులు

హన్మకొండ నుంచి జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, పరకాల మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, జడ్పీ సీఈవో శేషాద్రి, సీపీవో సత్యనారాయణ రెడ్డి, డీఏవో విజయ్ చంద్ర, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మహేందర్, డీఈవో గిరిరాజ్ గౌడ్, డిఐఈవో గోపాల్, డీపీవో లక్ష్మీ రమాకాంత్, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, డీవైఎస్ వో ప్రశాంత్, హౌసింగ్ పీడీ సిద్ధార్థ నాయక్, మిషన్ భగీరథ ఈఈ రామాంజనేయులు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, అడిషనల్ డీఆర్డీవో లక్ష్మి ప్రసన్నతో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అమాయక జనమే టార్గెట్

- రూ.200 టికెట్ తో బ్రీజా కారు ఆశ
- లాటరీ పేరిట రూ.11.50 లక్షల దోపిడీ
- 'వెంకటేశ్వర కార్ గిఫ్ట్ కాంటెస్ట్' గుట్టురట్టు చేసిన టాస్క్‌ఫోర్స్
- ముగ్గురు నిర్వాహకులు అరెస్ట్, లక్షల నగదు, కారు స్వాధీనం



అక్షరదర్బార్, వరంగల్: తక్కువ ధర గల కారును చూపిస్తూ.. లక్కీ డ్రా పేరిట అమాయక ప్రజల సొమ్మును దోచుకుంటున్న ఒక ముఠా ఆటకట్టించారు వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వరంగల్ ఉర్సు గుట్ట ప్రాంతంలో సాగుతున్న 'వెంకటేశ్వర కార్ గిఫ్ట్ కాంటెస్ట్' పై గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు.

### - రూ. 4.70 లక్షల కారు.. రూ.11.50 లక్షల వసూళ్లు

వివరాల్లోకి వెళ్తే.. నిందితులు కేవలం రూ.4,70,000 విలువ గల ఒక సెకండ్ హ్యాండ్ బ్రీజా కారు (టీఎస్03ఈక్యూ4101) ను లాటరీ బహుమతిగా ఎర వేశారు. ఒక్కో లాటరీ స్లిప్పును రూ.200 చొప్పున విక్రయిస్తూ ఇప్పటివరకు అమాయక ప్రజల నుండి ఏకంగా 5,753 స్లిప్పులను అమ్మి, రూ.11,50,000 వసూలు చేశారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీమధుసూదన్ పర్యవేక్షణలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె శ్రీధర్ తన సిబ్బందితో కలిసి ఈ తనిఖీలు చేపట్టారు. రూ.4,70,000 విలువైన బ్రీజా కారు, 5,753 లాటరీ స్లిప్స్, 34 బుక్స్, రూ. 53,500 నగదు, 6 స్మార్ట్ మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

### ముగ్గురు నిర్వాహకులు అరెస్ట్




ఈ అక్రమ లాటరీ దందా నడుపుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో పూజారి సుమన్ (గాయత్రి కాలనీ, పోచమ్మమైదాన్, వరంగల్), సముద్రాల రాకేష్ (కనక దుర్గా కాలనీ, సుబేదారి), కర్జుగట్ట సురేష్ (మెట్లబావి, శివనగర్, వరంగల్) ఉన్నారు. నిందితులపై చట్టరీత్యా కేసు నమోదు చేసి, తదుపరి చర్యల నిమిత్తం స్వాధీనం చేసుకున్న సొత్తుతో సహా వారిని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ కు అప్పగించారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె శ్రీధర్, ఎస్ఐ వీరస్వామి, టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు. నగరంలో ఇలాంటి నకిలీ లాటరీలు, బహుమతుల పేరిట మోసాలకు పాల్పడితే ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదని అధికారులు హెచ్చరించారు.

# ఓటరు ఎస్ఐఆర్ ఇంటింటి సర్వేను పరిశీలించిన కలెక్టర్ సత్యశారద

అక్షరదర్బార్, నర్సంపేట : ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద గురువారం నర్సంపేట పట్టణంలోని వల్లభ్‌నగర్, సాయినగర్ కాలనీల పోలింగ్ కేంద్రాల పరిధిలో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. బీఎల్ఓలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, ఓటరు వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను ఆమె స్వయంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సిబ్బందికి ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్హుడైన ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో ఆర్డీఓ ఉమారాణి, తహశీల్దార్ హరిచంద్ర రెడ్డి పాల్గొన్నారు.



# ఏసీబీ వలలో ఈఈ, ఏఈ

- రూ.60 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ అధికారులు
- పౌల్ట్రీ ఫామ్ 'ఎన్ఓసీ' కోసం లంచం డిమాండ్

అక్షరదర్బార్, ఆదిలాబాద్: అవినీతి అధికారులే లక్ష్యంగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మరోసారి పంజా విసిరారు. ఆదిలాబాద్ జిల్లా నీటిపారుదల శాఖ కార్యాలయంలో లంచం తీసుకుంటూ ఇద్దరు ఉన్నతాధికారులు ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. ఈఈ రాథోడ్ విఠల్, ఏఈ రూపవతి రమేష్ లంచం తీసుకుంటూ పట్టుబడినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లా సోనాల్ గ్రామంలోని ఒక వ్యవసాయ భూమి పక్కన చిన్న కాల్వ ప్రవహిస్తోంది. ఆ భూమికి సంబంధించిన యజమాని (ఫిర్యాదుదారుడు) తన పొలంలో పౌల్ట్రీ ఫామ్ (కోళ్ల ఫారం) నిర్మించుకోవడానికి ఇరిగేషన్ శాఖ నుండి నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ (ఎన్వోసీ) కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఎన్వోసీ మంజూరు చేయడానికి అధికారికంగా సహకరించేందుకు ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) రాథోడ్ విఠల్ రూ.60 వేలు లంచం డిమాండ్ చేశారు.
గురువారం ఈఈ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) రూపవతి రమేష్ ఫిర్యాదుదారుడి నుండి ఆ లంచం సొమ్మును స్వీకరిస్తుండగా ఏసీబీ ఆదిలాబాద్ రేంజ్ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

### కోర్టుకు తరలింపు

ఏఈ రమేష్ వద్ద నుండి లంచం సొమ్ము రూ.60 వేల నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విధి నిర్వహణలో అవినీతికి పాల్పడి చట్టవ్యతిరేకంగా లబ్ధి పొందడానికి ప్రయత్నించిన ఇద్దరు అధికారులపై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ తెలిపింది. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# తాగునీరు, బాత్రూం సమస్యలపై రోడ్డెక్కిన గిరిజన గురుకుల విద్యార్థినులు

- సమస్యలు చెబితే మార్కులు తగ్గిస్తామని ప్రిన్సిపాల్ బెదిరించినట్లు ఆరోపణ
- స్పందించి 12 గంటల్లో సమస్య పరిష్కరిస్తామని భరోసా ఇచ్చిన మంత్రి సీతక్క



అక్షరదర్బార్, కొత్తగూడ : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలోని గాంధీనగర్ గిరిజన బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలపై గురువారం విద్యార్థినులు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. పాఠశాల ప్రారంభమై నెల రోజులు గడిచినా తాగేందుకు స్వచ్ఛమైన నీరు అందడం లేదని, వినియోగానికి తగిన బాత్రూంలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. టాయిలెట్స్ మరమ్మతుల కోసం ఒక్కొక్కరి నుండి రూ. 10 వసూలు చేసినా పనులు చేయలేదని, సమస్యలు బయటకు చెబితే అంతర్గత మార్కులు తగ్గిస్తామని ప్రిన్సిపాల్ హెచ్చరించారని ఆరోపించారు. బందోబస్తు నిర్వహించిన కొత్తగూడ ఎస్సై రాజ్‌కుమార్ విద్యార్థినులకు ధైర్యం చెప్పారు.

### మంత్రి సీతక్క భరోసా

ఈ ఆందోళన విషయంపై కాంగ్రెస్ కొత్తగూడ మండలాధ్యక్షుడు బానోత్ రూప్ సింగ్ ద్వారా తెలుసుకున్న రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తక్షణమే స్పందించారు. విద్యార్థినులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, మౌలిక వసతుల సమస్యలను 12 గంటల్లో పరిష్కరించేలా అధికారులను ఆదేశిస్తానని, విద్యార్థినులపై బెదిరింపుల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తానున్నానంటూ విద్యార్థినులకు మంత్రి పూర్తి భరోసా కల్పించారు.

# చెరువులను నింపండి

- సాగు, తాగునీటికి తక్షణమే దేవాదుల జలాలు వదలాలి
- కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్లే 'గణప సముద్రం' కెనాల్ పనులు బంద్
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- రామప్ప, గణపురం చెరువుల సందర్శన.. క్షేత్రస్థాయిలో పరిశీలన



అక్షరదర్బార్, గణపురం: గణపురం, భూపాలపల్లి ప్రాంతాల ఆయకట్టు రైతాంగానికి బతుకుదెరువైన కాకతీయుల కాలం నాటి పురాతన గణపురం చెరువు, రామప్ప చెరువులను గురువారం భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా చెరువుల్లోని నీటిమట్టాన్ని పరిశీలించడంతో పాటు రామప్ప నుండి గణపురం చెరువుకు వెళ్లే గ్రావిటీ కెనాల్‌ను, రామప్ప నుండి పాకాలకు వెళ్లే పంప్ హౌస్‌లను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

### కెనాల్ పనులు ఆగిపోవడం దురదృష్టకరం

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. గణపురం చెరువు కింద నీరు ఉంటే గణపురం మండలమే కాకుండా భూపాలపల్లి, చిట్యాల, టేకుమట్ల మోరంచ వాగు ద్వారా ఆయా మండలాల రైతులు రెండు పంటలు సమృద్ధిగా పండిస్తారని గుర్తు చేశారు. "ప్రస్తుతం చెరువులో కేవలం 15 అడుగుల మేర మాత్రమే నీరు ఉంది. వర్షాభావ పరిస్థితులు నిరాశజనకంగా మారుతున్నాయి. ఇలాంటి కరవు పరిస్థితులు రాకూడదనే ఉద్దేశంతోనే గత కేసీఆర్ ప్రభుత్వం దేవాదుల పథకం ద్వారా రామప్ప నుండి గణపురం చెరువుకు గ్రావిటీ కెనాల్ నిర్మించేందుకు నిధులు మంజూరు చేసి, టెండర్లు కూడా పూర్తి చేసింది. కానీ ప్రభుత్వం మారడంతో ప్రస్తుత కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆ పనులు నిలిచిపోయాయి" అని గండ్ర మండిపడ్డారు.
– మిషన్ భగీరథకు ముప్పు.. తక్షణమే స్పందించాలి
నేడు గణపురం మండలంతో పాటు భూపాలపల్లి, చిట్యాల, టేకుమట్ల, రేగొండ, గోరికొత్తపల్లి మండల ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు ఈ చెరువు నుంచే అందుతుందని, ప్రస్తుత నీటిమట్టం తగ్గడం వల్ల రాబోయే రోజుల్లో తాగునీటికీ తీవ్ర ఇబ్బందులు తప్పవని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితమే దేవాదుల నుండి రామప్పకు నీటి పంపింగ్ ప్రారంభమైనందున.. రామప్పలో పూర్తి స్థాయి నీటి మట్టాన్ని నిర్వహిస్తూ, అక్కడి నుండి గ్రావిటీ కెనాల్ ద్వారా గణపురం చెరువుకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తద్వారా ఈ ప్రాంత ప్రజల తాగునీటికి, వ్యవసాయానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఇరిగేషన్ అధికారులను, రాష్ట్ర ప్రభుత్వాన్ని

# అందమైన నగరమే లక్ష్యం

- నెల రోజుల పాటు 'అనధికార ఫ్లెక్సీలు, పోస్టర్ల' తొలగింపు ప్రత్యేక డ్రైవ్
- నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు, కఠిన చర్యలు
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి వెంకన్న



అక్షరదర్బార్, వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యుఎంసీ) నగరాన్ని మరింత పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు నడుం బిగించింది. నగర సౌందర్యానికి భంగం కలిగిస్తున్న అనధికార ఫ్లెక్సీలు, బిల్‌బోర్డుల తొలగింపునకు శ్రీకారం చుట్టింది. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి వెంకన్న ఆదేశాల మేరకు.. ఏసీపీల పర్యవేక్షణలో టౌన్ ప్లానింగ్, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బృందాలు గురువారం నగరవ్యాప్తంగా విస్తృతంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాయి. హన్మకొండలోని అంబేద్కర్ సర్కిల్, మిషన్ హాస్పిటల్, సర్క్యూట్ గెస్ట్ హౌస్ తదితర ప్రధాన కూడళ్లలో అనుమతి లేకుండా అడ్డదిడ్డంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, ప్రచార బోర్డులను తొలగించారు.

### - రెండు విడతల్లో ప్రత్యేక కార్యాచరణ

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ టి వెంకన్న మాట్లాడుతూ, నగరవ్యాప్తంగా నెల రోజుల పాటు ఈ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని స్పష్టం చేశారు. దీనికోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందించినట్లు తెలిపారు. మొదటి విడత..వారం రోజుల వ్యవధిలో నగరంలోని ప్రధాన రహదారులు, కూడళ్లలో ఉన్న అన్ని అనధికార ఫ్లెక్సీలు, బిల్‌బోర్డులను పూర్తిగా తొలగిస్తారు. రెండో విడత..ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలు, గోడలపై అనుమతి లేకుండా రాసిన వాల్ రైటింగ్స్, అంటించిన పోస్టర్లను పూర్తిగా తొలగిస్తారు. వాటి స్థానంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా నయనమనోహరమైన వాల్ పెయింటింగ్‌లు వేయిస్తారు.

### - నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానా..

పాఠశాలలు, కళాశాలలు, కోచింగ్ సెంటర్లు, వాణిజ్య సంస్థలు మున్సిపల్ అనుమతి లేకుండా ఎలాంటి ఫ్లెక్సీలు, ప్రచార బోర్డులు ఏర్పాటు చేయరాదని కమిషనర్ హెచ్చరించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, పార్కులు, విద్యుత్ స్తంభాలు, సెంట్రల్ డివైడర్లు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లతో పాటు ఇతర బహిరంగ ప్రదేశాలలో పోస్టర్లు, స్టిక్కర్లు అంటించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించి నగర వికృతీకరణకు పాల్పడే వారిపై మున్సిపల్ చట్టాల ప్రకారం భారీ జరిమానాలతో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# విద్యార్థినులు ఉన్నత శిఖరాలకు చేరాలి

- హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేసిన కలెక్టర్

అక్షరదర్బార్, హనుమకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, కష్టపడి చదివి జీవితంలో అత్యున్నత స్థానాలకు చేరుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ వడ్డేపల్లిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. కళాశాలలో విద్యా బోధన తీరును, విద్యార్థినులకు కల్పిస్తున్న వసతులను, అల్పాహారం, మధ్యాహ్న భోజన నాణ్యతను ఆమె స్వయంగా పరిశీలించారు.

### విద్యార్థినులతో కలిసి అల్పాహారం

కళాశాల సందర్శనలో భాగంగా విద్యార్థినులకు బ్రేక్‌ఫాస్ట్‌లో అందిస్తున్న మైసూర్ బోండాను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి కూర్చుని ఆమె అల్పాహారం చేశారు. ప్రతిరోజూ అందిస్తున్న బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచి, మెనూ వివరాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలోని తాగునీటి సౌకర్యాలను పరిశీలించి, ఆర్వో వాటర్ ప్లాంట్ పనితీరును తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే ఆహారం నిరంతరం పరిశుభ్రంగా, పోషక విలువలతో కూడి ఉండేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. నాణ్యమైన, పోషక విలువలున్న ఆహారాన్ని అందించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి." అని జిల్లా కలెక్టర్ అన్నారు.